క్లుప్తంగా

యువతకు సునీతా విలియమ్స్ ఆదర్శం



సునీతా విలియమ్స్‌కు అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజానగరం: రోదసీలో తొమ్మిది నెలలు ఉండి, క్షేమంగా తిరిగొచ్చిన సునీతా విలియమ్స్‌ని మహిళలు, ముఖ్యంగా నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మండలంలోని వెలుగుబంద ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం వై.అగ్నేశ్వరరావు అన్నారు. రోదసీ యాత్రికురాలు సునీతా విలియమ్స్‌కు అభినందనలు తెలుపుతూ పాఠశాలలో విద్యార్థులతో కలసి గురువారం కార్యక్రమం నిర్వహించారు. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఒడిదుడుకులను ఆత్మవిశ్వాసంతో ఆమె ఎదుర్కొన్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వపన్‌కుమార్, సుధీర్, శ్రీనివాసరావు, డేవిడ్‌రాజు, వెంకటలక్ష్మి, భవాని, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు సాగునీటి విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలో ఉన్న తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి ఈ నెల 31 వరకు సాగునీరు విడుదల చేయాలని పథకం పాలకవర్గం తీర్మానించింది. గురువారం రఘుదేవపురంలో తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఏఈ ఎస్.శివరామకృష్ణ ఆధ్వర్యంలో స్కీమ్ చైర్మన్ వేగి శ్రీనివాస్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి సాగునీటి విడుదలను నిలిపివేసి, జూన్ 10న తిరిగి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పాలకవర్గ వైస్ చైర్మన్ మందపాటి జగపతిరాజు, ప్రెసిడెంట్లు కోనే శ్రీనివాస్, నిడదవోలు మంగతాయారు, సభ్యులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో శారీరక ఆరోగ్యం



అనపర్తిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు

పెదపూడి: నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవడంతో శరీరం, మనస్సు ఆరోగ్యంగా ఉంటుందని అనపర్తి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ టి.రామగుర్రెడ్డి అన్నారు. అనపర్తిలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుర్రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దంతాల సంరక్షణపై అవగాహన కలిగి, వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ఆస్పత్రి డెంటల్ సర్జన్ డాక్టర్ సీహెచ్‌ఎస్ భాగ్యలక్ష్మి రోగులకు ఉచితంగా దంత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, డాక్టర్లు కోటేశ్వరి, అమృత, చారి, సరోజిని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధి డీకే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్ష చేస్తున్న వైద్యుడు

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన గంగా ఆస్పత్రి వైద్యుడు పిల్లాడి పరమహంస ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు చేశారు. మొత్తం 209 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు.

వాహనాల వేలం



వేలం నిర్వహణలో పాల్గొన్న ఎస్సై, తహసీల్దార్

బిక్కవోలు: వివిధ నేరాల్లో ఉన్న వాహనాలకు స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం వేలం నిర్వహించారు. తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ సమక్షంలో బహిరంగ వేలం వేశారు. ఇందులో 19 మోటార్ బైకులు, ఆటో, కారుకు వేలం నిర్వహించారు. మొత్తం 43 మంది వేలం పాడుకోవడంతో, జీఎస్టీతో కలిపి రూ.1,88,600 లభించాయి. ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

కుల వృత్తి సంఘాలతో సమావేశం

సీతానగరం: మండలంలోని కుల వృత్తిదార్ల సంఘాలతో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఎం.భారతి సమావేశం నిర్వహించారు. వారికి కావాల్సిన కుల వృత్తుల ఆధునిక పరికరాల వివరాలను తెలుసుకున్నారు. ఆదరణ-3 పథకంలో కుల వృత్తుల వారికి పరికరాలను అందించడానికి ప్రభు త్వం సమాయత్తమైందన్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఈఓపీఆర్డీ కేవీఎస్‌ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పరేషన్ తప్పేదా..?

- కొత్త రేషన్ కార్డులకు మోక్షమెప్పుడో?
- ఆశగా ఎదురు చూస్తున్న అర్హులు
- సంక్షేమ పథకాలు నిలువరించేందుకేనని ప్రజల అనుమానం



బిక్కవోలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తి కావస్తున్నా.. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వకపోవడంతో సర్వత్రా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అనపర్తి నియోజకవర్గంలో వందలాది మంది అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై కనీస ఆలోచన చేస్తున్నట్టే లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా ఏమీ చేయలేమని రెవెన్యూ అధికారులతో పాటు, సచివాలయ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో అక్కడికి వెళ్లిన ప్రజలు నిరాశగా వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రేషన్ కార్డుల్లో మార్పులుచేర్పులకు కూడా అవకాశం లేకుండా పోయిందని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలతో సరి!

అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించిన కూటమి నాయకులు.. తీరా అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డు ఉంటేనే అనేక సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులవుతారు. అందుకే కార్డులను మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో..

రేషన్ కార్డుల మంజూరు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా జరిగేది. అర్హులైన ప్రజలు సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే చాలు.. వెంటనే కార్డులు మంజూరయ్యేవి. కొన్ని సందర్భాల్లో గంటల వ్యవధిలో కూడా కార్డులు మంజూరు చేశారు. కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చుకోవాలన్నా, తొలగించాలన్నా సచివాలయ పనిదినాల సమయంలో ప్రభుత్వ సైట్లు ఎప్పుడూ అందుబాటులోనే ఉండేవి. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, వారే స్వయంగా దరఖాస్తు చేసి, కార్డు మంజూరైతే ఇంటికి తీసుకొచ్చి లబ్ధిదారులకు అందజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సార్వతిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి సైట్లన్నీ స్తంభింపజేశారు. ప్రస్తుత ప్రభుత్వ పాలన తీరు ఇలా ఉంటే.. సూపర్ సిక్స్ పథకాలు ఎలా అమలు చేస్తారంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

నియోజకవర్గంలో ప్రస్తుతం తీరిది..

మండలం	రేషన్ కార్డులు
అనపర్తి	23,175
బిక్కవోలు	23,146
రంగంపేట	20,323
పెదపూడి	23,932
మొత్తం	90,576

కొత్త కార్డుల మంజూరు ఎప్పుడో?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతుంది.ఇప్పటి వరకు కొత్త కార్డుల ఊసేలేదు.కార్డుల్లో చేర్పులు,మార్పులకు అవకాశం లేదు. అసలు సైట్లే ఓపెన్ కావడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొత్త కార్డుల మంజూరుకు మార్గదర్శకాలు జారీ చేయాలి.

– బొద్దు ముత్యాలరావు, పందలపాక

కార్డుల కోసం ఎదురుచూపులు



గత ప్రభుత్వం హయాంలో గంటల వ్యవధిలో రేషన్ కార్డులు వచ్చేవి. వలంటీర్లు ఇంటింటికి వచ్చి కార్డులు కోసం దరఖాస్తులు చేయించేవారు. ప్రస్తుతం కార్డులు సకాలంలో అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వందలాది మంది కోత్త కార్డు కోసం ,మార్పుల కోసం ఎదురుచూస్తున్నారు.

– పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఊలపల్లి

మార్గదర్శకాలు రావాలి



కొత్త కార్డుల మంజూరు,కార్డుల్లో చేర్పులు ,మార్పుల కోసం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సింది.త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే సమాచారాన్నిప్రజలందరికీ తెలియజేస్తాం.

– బీఎస్‌వీవీ కృష్ణ, తహసీల్దార్, బిక్కవోలు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయిబాబా సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు తెలిపారు. పెదపూడి గ్రామంలో సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం వారు కంప్యూటర్ ద్వారా చత్వార, తలపోటు పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. కంట్లో శుక్లాలున్న వారికి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు. శిబిరంలో వైద్యులు 136 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 16 మందికి ఆపరేషన్లు, 42 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ప్రతినెలా మూడో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. అలాగే సమితి ఆవరణలో ప్రతి మంగళవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ మార్ని సత్యనారాయణ చౌదరి, సేవా దళ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్న హంస కుటుంబానికి అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: వైఎస్సార్ సీపీ జి.మామిడాడ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి(చిన్న హంస) ఇటీవల మరణించారు. ఆయన తండ్రి ప్రభాకర్‌రెడ్డి, సోదరుడు వెంకటరమణారెడ్డిని పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, చిన్న హంస మృతి చాలా బాధాకరమని, ఆయన కుటుంబానికి తాము, పార్టీ అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే వెంట పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, పార్టీ నాయకులు మండ రాజారెడ్డి, సబ్బెళ్ల వెంకటరెడ్డి, కర్రి వీర్రెడ్డి తదితరులు ఉన్నారు.

29న మండల పరిషత్ సమావేశం

సీతానగరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

కరెంటు కోతతో ప్రజల ఇక్కట్లు

మధురపూడి: వేసవి ప్రారంభంలోనే కోరుకొండ మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ కోతలు మొదలయ్యాయి. గురువారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.30 వరకూ అప్రకటిత కరెంటు కోత విధించడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. పదో తరగతి పరీక్షలు జరుగుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అప్రకటిత కోతలు విధించడంతో వేసవి తీవ్రమయ్యే కొద్దీ మరిన్ని కష్టాలు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బూరుగుపూడి, గుమ్ములూరు, బుచ్చెంపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఘనంగా వెలగాలమ్మ జాతర

మధురపూడి: కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామ దేవత వెలగాలమ్మ వారి జాతర గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.30 వేల నగదును ఉత్సవ కమిటీ నాయకులకు అందజేశారు.

ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు



ఉత్సవాల్లో మాట్లాడుతున్న రఘుపతి మాస్టారు

పెదపూడి: సత్యసాయిబాబా సూచించిన దశ సూత్రాలు ఆచరించి దివ్యమైన జీవితం కోసం ఆధ్యాత్మిక సాధన చేయాలని సత్యసాయి వ్రతావధాని యడవల్లి రఘుపతి మాస్టారు అన్నారు. అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సాయిరామారెడ్డి ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంత్యుత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సర్పంచ్ తేతలి సుధాకర్‌రెడ్డి, కర్రి శ్రీనివాసారెడ్డి, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు బులుసు వెంకటేశ్వర్లు, రోహిణీకుమార్, ఎం.వీర్రాజు, తిక్కిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో వసూళ్లు పూర్తి చేయాలి

ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

పెదపూడి: మండలంలోని పంచాయతీల్లో సచివాలయ కార్యదర్శులు ఇంటి పన్నుల వసూళ్లు వారం రోజుల్లో పూర్తి చేయాలని, లేకుంటే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి హెచ్చరించారు. పెదపూడి పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీలో మొత్తం రూ.17,15,801 వసూలు చేయాల్సి ఉందన్నారు. వీటిలో 92 శాతం మేర పన్ను వసూళ్లు పూర్తి చేశారన్నారు. మిగిలిన ఇంటి పన్నుల వసూళ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే డ్రైనేజీల్లో పూడికలు ఎప్పటికప్పుడు తీయించాలన్నారు. వీధి లైట్లు అన్నీ వెలిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి జి.ఉషారాణి, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీపద్మ, శ్రీగౌరి

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి, ప్రీ స్కూల్ విద్య నాణ్యతకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను అంగన్‌వాడీ వర్కర్లు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సంపర, పెదపూడి సెక్టార్ల సూపర్‌వైజర్లు శ్రీగౌరి, శ్రీపద్మ అన్నారు. రామేశ్వరం గ్రామంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమంపై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం, విద్య అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో రెల్లి కులస్తులకు అన్యాయం



రాజానగరంలో సమావేశమైన రెల్లి సంఘాల ప్రతినిధులు

రాజానగరం: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు తీరని అన్యాయం జరుగుతుందని రాష్ట్ర రెల్లి కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు బొచ్చా నరసింహమూర్తి, ముత్యాల సుబ్రహ్మణ్యం, బంగారురాజు, బొచ్చా శివకుమార్ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజానగరంలోని రెల్లిపేటలో ఆ సామాజిక వర్గీయులు గురువారం సమావేశమయ్యారు. మండపేట, మరికొన్ని చోట్ల రెల్లి కులస్తులకు రిజర్వేషన్ల పరంగా జరిగిన అన్యాయంపై చర్చించారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు ఒక శాతం మాత్రమే రిజర్వేషన్ ఇచ్చారని, ఇది విద్యా, ఉద్యోగ, రాజకీయ పరంగా అణగదొక్కే చర్యగా అభివర్ణించారు. దళితుల్లోనే దళితులుగా అట్టడుగున ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మూడు శాతా నికి రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కేవీకేలో రైతుల క్షేత్ర సందర్శన



క్షేత్ర సందర్శన చేస్తున్న రైతు మహిళలు

రాజానగరం: వ్యవసాయ పనులపై ఆధారపడిన షెడ్యూల్డ్ కులాల వారిని ఆర్థికంగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికను అమలు చేస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్టు చెప్పారు. కలవచర్లలోని కేవీకేలో ఉన్న పంట క్షేత్రాలను గొల్లప్రోలు, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన 50 మంది రైతులు, రైతు మహిళలు గురువారం సందర్శించారు. వారికి వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, శ్రీనిధి, రఘునందన్, సంజయ్ వినాయక్ హెగ్డే, విజయవర్ధన్, రత్నాజీ పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వెనుకబడిన, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల నిరుద్యోగులు స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు అవసరమైన రుణాలు పొందేందుకు శనివారంలోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. 21 నుంచి 60 ఏళ్లలోపు బీసీలు, ఈబీసీలకు చెందిన నిరుద్యోగులు స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీస్‌ని ఏర్పాటు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఈబీసీ పరిధిలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాల వారు 21 నుంచి 50 ఏళ్లలోపు వారై, సంబంధిత యూనిట్లకు అర్హతలు ఉండాలన్నారు. రుణాలకు సబ్సిడీ ఉంటుందన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్‌లో 90 రోజుల ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు శనివారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండల కేంద్రంలోనే శిక్షణ ఇస్తారన్నారు.

ప్రభుత్వ స్థలంలో చెట్ల నరికివేత

కలెక్టర్‌కు సంపత్‌నగరం గ్రామస్తుల ఫిర్యాదు



నరికిన చెట్లను రవాణా చేస్తున్న వాహనం

రాజానగరం: మండలంలోని సంపత్‌నగరం పంచాయతీ పరిధిలో ఉన్న యాతం చెరువు, సర్వే నంబరు 454లో ఉన్న వేప చెట్లను అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా నరికి, విక్రయించారని జిల్లా కలెక్టరుకు ఆ గ్రామానికి చెందిన మద్దిరెడ్డి రాంబాబు, మరికొందరు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి, వీఆర్వోకు తెలియజేసినా, ఎటువంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వ ఆస్తిని ఇలా దౌర్జన్యంగా సొంతం చేసుకున్న సంబంధిత వ్యక్తులపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఫిట్‌నెస్ పరీక్షలు పాత విధానంలోనే చేయాలి



రాజానగరంలోని వెహికిల్ టెస్టింగ్ పాయింట్ వద్ద వాహన యజమానుల ఆందోళన

రాజానగరం: వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను పాత విధానంలోనే చేయాలని వాహన యజమానులు డిమాండ్ చేశారు. రాజానగరంలోని వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్ పాయింట్ వద్ద గురువారం దీనిపై యజమానులు ఆందోళన చేపట్టారు. గతంలో వాహనాల ఫిట్‌నెస్ టెస్టింగ్ అంతా రాజమహేంద్రవరం ఆర్టీఓ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో జరిగేదని, వాహనదారు సముద్రాల జగపతిరావు అన్నారు. కొంతకాలంగా దీనిని ప్రైవేట్‌పరం చేయడంతో టెస్టింగ్ విధానమంతా అవినీతిమయమైందని ఆరోపించారు. వాహన స్థాయిని బట్టి రేటు నిర్ణయించి, వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇందుకు ఫీజు గతంలో రూ.670 ఉంటే, ఇప్పుడు రూ.1,300 డిమాండ్ చేస్తున్నారన్నారు. వాహనాల ఫిట్‌నెస్‌ని పరీక్షించే సమయంలో యజమానిని ఉండనివ్వడం లేదని, దీనిపై ప్రశ్నిస్తే తమ ఇష్టం అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు ఎన్ని వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతాయో వారి ఇష్టారాజ్యంగా మారిందని విమర్శించారు. నిర్ణీత రుసుం చెల్లించాక రెండు రోజుల్లో టెస్టింగ్ చేయించకపోతే, మూడో రోజు ఆ రుసుం చెల్లుబాటు కాదన్నారు. జిల్లాలోని వాహనదారులంతా ఫిట్‌నెస్ టెస్టింగ్ కోసం రాజానగరం పాయింట్‌కే రావలసి ఉందన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచన చేసి, పాత విధానంలో ఆర్టీఓ అధికారుల పర్యవేక్షణలో టెస్టింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఆరు చోరీ కేసుల్లో నిందితుడైన కొంతమూరు గ్రామానికి చెందిన కొండేటిసాయికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఆరో ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎస్.రెడ్డి ప్రసన్న గురువారం తీర్పునిచ్చారు. గత రెండేళ్ల కాలంలో నిందితుడు బొమ్మూరు, పరిసర ప్రాంతాల్లో ఆరు తాళం వేసిన ఇళ్లలో రాత్రివేళ తలుపు పగులగొట్టి, బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశాడు. బొమ్మూరు గ్రామానికి చెందిన ఆనంద్‌ప్రకాష్ ఫిర్యాదు మేరకు, అప్పటి బొమ్మూరు సీఐ ఆర్.విజయకుమార్ కేసు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. ప్రస్తుత సీఐ కాశీవిశ్వనాథ్ పర్యవేక్షణలో, కోర్టు కానిస్టేబుల్ డీఎల్ గంగాధరరావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో నేరాలు రుజువు కావడంతో నిందితుడికి ఏకకాలంలో ఏడాది పాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఏపీపీ ఓలేటి మహాలక్ష్మి ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

రేపు ‘సంకల్ప’ మెగా జాబ్ మేళా

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత సంకల్ప మెగా జాబ్ మేళాకు హాజరై ఉద్యోగాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంకల్ప-జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాలో 25 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. వివిధ ఉద్యోగాలకు టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంకాం తదితర కోర్సులు పూర్తి చేసిన 19 నుంచి 50 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ సంయుక్తాధ్వర్యంలో రాజమండ్రి నియోజకవర్గంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తారన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర సమాచారం కోసం 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎ.అప్పలకొండ, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం పాల్గొన్నారు.